నెలాఖరులోపు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం రూరల్ : పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటును నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భీమవరం మండలం తుందుర్రు సచివాలయం, పట్టణంలో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను సంబంధిత అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వెళ్లడానికి, రావడానికి వేర్వేరు ద్వారాలుగాని, ఒకటే పెద్ద ద్వారం ఉంటే పార్టిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరు టాయిలెట్స్ ఉండాలన్నారు. వికలాంగులకు ఇబ్బంది లేకుండా ర్యాంపును సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను డిఇఒ చూడాలని, పట్టణ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడీ కేంద్రాలు, అసోసియేషన్ హాళ్లను మున్సిపల్ కమిషనర్లు సిద్ధం చేయాలన్నారు. .

భూహక్కు కాదు.. భూకబ్జా చట్టం..!

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో రద్దు అంశం పెట్టాలి

భూహక్కు చట్టం రద్దు చేయాలని, అంగన్వాడీలపై ఎస్మా తొలగించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం రైతులు, భూయజమానుల హక్కులు హరించే నల్ల చట్టమని పలువురు వక్తలు విమర్శించారు. ఇది హక్కును కాపాడే చట్టం కాదని, భూకబ్జా చట్టమని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. బిజెపి, వైసిపి మినహా వామపక్షాలైన సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐతోపాటు టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలు, లాయర్స్ సంఘాల, ప్రజాసంఘాల ప్రతినిధులు మాజరయ్యారు. ఈ సందర్భంగా భూహక్కు చట్టంపై సమగ్రంగా చర్చించారు. చట్టం అమలు, విధి విధానాలు, లోటుపాట్లు, రైతులు, భూయజమానులకు ఏర్పడే ఇబ్బందులు, చట్టం పట్ల కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై చర్చించారు. భూమి రాజ్యాంగం కల్పించిన హక్కుని, దాన్ని కాలరాసే విధంగా భూహక్కు చట్టాన్ని తీసుకొచ్చి భూదోపిడీకి పాల్పడేలా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శలు గుప్పించారు. భూహక్కు చట్టం అనేది లాయర్ల సమస్యగా చూస్తున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజాపోరాటంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. దీనిపై సముచితంగా ఆలోచించి టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో భూహక్కు చట్టం రద్దును పెట్టాలని కోరింది. భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని, అంగన్వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మాను తొలగించి సమస్యలు పరిష్కరించాలని సమావేశం తీర్మానించింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ఎంసిపిఐ (యు) నేతలు గులిపల్లి రాంబాబు, రమేష్‌బాబు, చిర్ల రాజేంద్రప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘంనాయకులు బాతిరెడ్డి జార్జి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలి
కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి

కార్పొరేట్లకు భూములు దారాదత్తం చేసేందుకే భూహక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. 66 శాతం భూవివాదాల కేసులు కోర్టుల్లో నడుస్తున్నాయి. రెవెన్యూ అథారిటీ పరిధిలో భూసమస్యలు ఎలా పరిష్కారమవుతాయి. 90 ఏళ్ల నుంచి ఎస్‌సి, బిసి, మైనార్టీలు సాగు చేస్తున్న భూములను లాక్కోవాలని చూడటం దుర్మార్గం. రాబోయే ఎన్నికల్లో చట్టం రద్దు అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టాలి.

సమస్యలపై వామపక్షాలు నిరంతర పోరు
వేంద్ర శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వైసిపి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోంది. ప్రజలకు అవసరం లేని చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తుంది. కోర్టులున్నాయి కాబట్టి ప్రజాస్వామ్యం ఇంకా బతికే ఉంది. భూహక్కు చట్టం ఉన్నత వర్గా లకు తప్ప సామాన్యులకు అందుబాటు లో లేనిది. చట్టాన్ని రద్దు చేస్తామని మా పార్టీ అధి నేత చంద్రబాబు ఇటీవల హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వామపక్షాల నిరంతర పోరు అభినందనీయం.

హక్కులను హరించే దోపిడీ చట్టం
బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం హక్కులను హరించే దోపిడీ చట్టం. బిజెపి ఆదేశాలతో నీతి ఆయోగ్ సూచన మేరకు ప్రభుత్వం నల్లచట్టం బిల్లు తీసుకొ చ్చింది. దీనిపై అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా, న్యాయవాదుల సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలనే ప్రజా స్వామిక సూత్రాన్ని సైతం ప్రభుత్వం ఎక్కడా పాటించలేదు. సుప్రీం తీర్పును కూడా పాటించని దుర్మార్గమైన ప్రభుత్వం ఇది. భూవి వాదాలు ఎక్కువగా ఏర్పడే రెవెన్యూ శాఖకే మళ్లీ ఈ భూహక్కు చట్టాన్ని అప్పగించడం అత్యంత దారుణం. భూసమస్యలపై రైతులు, భూ యజమానులను హైకోర్టుకు వెళ్లాలనడం దుర్మార్గం. భూసేక రణకు యాజమాన్య హక్కుల చట్టాలు పాటించకపోవడం సిగ్గుచేటు. 2013 భూసేకరణ చట్టానికి బిజెపి తూట్లు పొడిచింది. మెడపై కత్తి_లా వేలాడుతున్న భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసే వరకు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు ఐక్యంగా ఉద్యమించాలి.

సామాన్యులను భాగస్వాములను చేయాలి
ఎం.వంశీరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

భూహక్కు చట్టాన్ని 29 రాష్ట్రాలు వ్యతిరేకించాయి. ముఖ్యమంత్రి జగన్ ఒక్కడే రాష్ట్రంలో దీన్ని అమలు చేస్తున్న ఘనుడు. చెప్పిన దాన్ని పాటించడం తప్ప వ్యతిరేకించడం అనేది లేదు. కార్పొరేట్లకు భూములను దోచి పెట్టేందుకే యాక్ట్ తీసుకొచ్చారు. భూహక్కు చట్టం రద్దు కోసం జరిగే పోరాటంలో సామాన్యులను భాగస్వాములను చేయాలి.

రాష్ట్రంలో అమలు అత్యంత దారుణం
లంకా కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు

బిజెపి పాలిత రాష్ట్రాల్లో భూహక్కు చట్టాన్ని వ్యతిరేకించారు. రాష్ట్రంలో వైసిపి మాత్రం దీన్ని అమలు చేయడం అత్యంత దారుణం. బిజెపి కనుసన్నల్లో వైసిపి నడుస్తోంది. ఈ చట్టం రైతులకు, ప్రజానీకానికి తీవ్ర నష్టం చేకూరుస్తుంది. గ్రామస్థాయిలో అవగాహన కల్పించి అన్ని పక్షాలను కలుపుకుని ఉద్యమాన్ని ముందుకు సాగించాలి.

భూసేకరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం
పి.శ్రీనివాసరావు, ఐలు జిల్లా సహాయ కార్యదర్శి

ప్రభుత్వం తెచ్చిన 513 జిఒను న్యాయవాదులు, న్యాయనిపుణులు, రాజకీయ నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఆస్తి హక్కును రాజ్యాంగం కల్పించింది. మానవులను భూమి నుంచి వేరు చేయమని ఏ న్యాయస్థానమూ చెప్పలేదు. రాజ్యాంగ విరుద్ధంగా భూహక్కు చట్టాన్ని తీసుకురావడం దారుణం. గిరిజనుల భూములపై కనీస స్పష్టత ఇవ్వలేదు. ల్యాండ్ అథారిటీ కార్పొరేషన్ కింద తీసుకొచ్చి ఛైర్మన్‌ను, కమిటీ సభ్యులను పెట్టి భూములను కబ్జా చేయడానికి చూస్తున్నారు. కోర్టులో నాలుగు పిల్స్ పెండింగులో ఉన్నాయి. రాజకీయ పార్టీలు కూడా దీనిపై దృష్టి పెట్టాలి.

భూకబ్జాల కోసమే ఈ చట్టం
ఉండవల్లి రమేష్‌నాయుడు, జనసేన నేత

భూమిని కొనాలన్నా.. అమ్మాలన్నా.. టైటిలింగ్ అధికారి వద్దకు వెళ్లి సర్టిఫికెట్ తీసుకురావాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ భూమిపై ఎవరైనా అభ్యంతరం తెలిపితే అక్కడితో ఇది నిలిచిపోతుంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం హక్కులు హరించే విధంగా వ్యవహరిస్తోంది. రాజకీయ పక్షాలు ఈ సమస్యపై దృష్టి పెట్టాల్సి ఉంది. అవినీతిలో కూరుకుపోయిన వైసిపి ప్రభుత్వం భూకబ్జా చేసేందుకే ఈ భూహక్కు చట్టాన్ని తీసుకొచ్చింది.

రాజ్యాంగం కల్పించిన హక్కు
కె.మునిస్వామి, ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి

భూమి రాజ్యాంగం కల్పించిన హక్కు. వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది ప్రజలకు అన్యాయం చేయడమే. రాజకీయ పార్టీలు సహృదయంతో ఆలోచించాలి. రెండు నెలల నుంచి కోర్టులు జరగట్లేదు. న్యాయవాదులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్లాలి. కోర్టులకు ఉన్న హక్కులు రద్దు చేయాలనుకోవడం దుర్మార్గం.

పులివెందుల పాలిటిక్స్ నడుపుతున్నారు
గంగాధర్‌రెడ్డి, ప్రముఖ అడ్వకేట్

1923లో సర్వే చట్టం వచ్చింది. తొమ్మిదేళ్లపాటు భూమిని సర్వే చేశారు. 1932లో నిర్దిష్టమైన ఆర్ఎస్ఆర్‌ను రూపొందించారు. అప్పట్లో మ్యానువల్‌గా దీన్ని తయారు చేశారు. భూహక్కు చట్టంపై ధర్మాన సోదరులు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత దారుణంగా ఉన్నాయి. ప్రస్తుతం పులివెందుల పాలిటిక్స్ ఇక్కడ నడుస్తున్నాయి. గ్రహించకపోతే సమస్యలు తప్పవు.

అరాచక పరిపాలనలో నల్లచట్టం
ఎంవి.వెంకటరమణ, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు

హక్కు చట్టాన్ని వ్యతిరేకించడంలో టిడిపి వెనుకబాటుతనం చూపిస్తోంది. ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమంగా దీన్ని తీర్చిదిద్దాలి. టిడిపికి 40 ఏళ్ల అనుభవం ఉంది. జనసేన ప్రజల్లోకి ఇప్పుడిప్పుడే వస్తుంది. అరాచక పాలనలో వైసిపి నల్ల చట్టాన్ని తీసుకొచ్చింది. ఎమర్జెన్సీని తీసుకొచ్చిన ఇందిరాగాంధీ, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపికి గతంలో ఏ గతి పట్టిందో వైసిపి గుర్తుంచుకోవాలి.

క్యాష్ కొట్టు.. టిక్కెట్ పట్టు..!

అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారిన ఆర్థిక బలం

రూ.కోట్లు కుమ్మరిస్తే కొత్తవారికైనా టిక్కెట్

క్షేత్రస్థాయిలో బలమున్నా డబ్బు లేకపోతే పక్కకే

డబ్బు సంచులతో తెరపైకి కొత్త ముఖాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నీతి, నిజాయతీ, విలువలతో పని లేకుండాపోయింది. ఎవరు ఎక్కువ కోట్లలో సొమ్ము ఖర్చు పెడితే వారికే టిక్కెట్ అన్నట్లు ప్రధాన పార్టీల వ్యవహారశైలి తయా రైంది. దీంతో కొంతమంది నాయకులకు ప్రజాబలం ఉన్నా టిక్కెట్ రాని పరిస్థితి నెలకొందనే చర్చ నడుస్తోంది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన సైతం ఇదే తరహాలో అభ్యర్థుల ఎంపికను కొనసాగిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన పార్టీల్లో టిక్కెట్ ఆశిస్తున్న నేతల్లో పలువురికి ఆర్థిక బలం లేక ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఎన్నికల తంతు మొత్తాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు డబ్బుమయంగా మార్చేసిన పరిస్థితి ఉంది.

పోలవరం ఎంఎల్ఎగా పని చేస్తున్న తెల్లం బాలరాజుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో ఈసారి ఆయన్ని తప్పించాలని వైసిపి అధిష్టానం భావించింది. ఆయన్ని మారిస్తే పెద్దఎత్తున సొమ్ము ఖర్చు పెట్టే నేతలు లేరని బాలరాజు భార్యకే టిక్కెట్ కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజాపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో ఆయనకు టిక్కెట్ ఇచ్చేందుకు వైసిపి నిరాకరించింది. ఎంతోమంది ఆశావహులు చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్నప్పటికీ ఆర్థిక, అంగ బలం ఉన్న రవాణాశాఖ అధికారి విజయరాజుకు టిక్కెట్ కేటాయించినట్లు చెబుతున్నారు. ఈయన స్వయంగా శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు వియ్యంకుడు. కైకలూరు ఎంఎల్ఎగా దూలం నాగేశ్వరరావు ఉన్నారు. ప్రజల్లో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని తేలింది. అదే నియోజకవర్గంలో ఇటీవల టిడిపి నుంచి వైసిపిలోకి వెళ్లి ఎంఎల్‌సి పదవి దక్కించుకున్న జయమంగళ వెంకటరమణకు ప్రజల్లో కొంత సానుకూలత ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అయితే జయమంగళ పెద్దఎత్తున సొమ్ము ఖర్చు పెట్టలేరనే కారణంతో ఆయనను పక్కన పెట్టి నాగేశ్వరరావు వైపే వైసిపి అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఆచంట, తాడేపల్లిగూడెం, నరసాపురం వంటి నియోజకవర్గాల్లోనూ స్థానిక ఎంఎల్ఎలపై వ్యతిరేకత ఉన్నప్పటికీ సరైన ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులు దొరకకపోవడంతో ప్రస్తుతం ఉన్నవారినే కొనసాగించేందుకు వైసిపి ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ముందుముందు విడుదల చేసే అభ్యర్థుల జాబితాల్లో ఏమైనా మార్పులు ఉంటాయో, లేదో వేచిచూడాలి. ఏలూరు ఎంపీగా ఆర్థిక బలం మెండుగా ఉన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌ను రంగంలోకి దించారు. ఈయన జనానికి పెద్దగా తెలియని వ్యక్తి అయినప్పటికీ ఆర్థిక బలం చూసి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. నరసాపురం ఎంపీ అభ్యర్థి విషయంలో ఆర్థిక బలం ఉన్నవారి కోసం వైసిపి వెదుకులాడుతున్నట్లు సమాచారం.

టిడిపి, జనసేనది అదేబాట

టిడిపి, జనసేన సైతం ఆర్థిక బలం ఉన్నవారికే టిక్కెట్ ఇచ్చేందుకు తహతహలాడుతున్నట్లు చర్చ నడుస్తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా, టిడిపి హయాంలో ఏలూరు ఎంపీగా మాగంటి బాబు పని చేశారు. ఈసారి ఆయన టిడిపి నుంచి ఏలూరు ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఎంపీగా పోటీలోకి దిగాలంటే కనీసం రూ.60 కోట్లుపైగా ఉండాలని, మాగంటి బాబు వద్ద అంత ఆర్థిక బలం లేదనే కారణంతో ఆయనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. మాగంటి కుటుంబం సుదీర్ఘకాలంగా ఏలూరుతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కీలక భూమిక పోషించింది. మాగంటి బాబు కుటుంబానికి జనాల్లో ఆదరణ ఉన్నప్పటికీ ఆర్థిక బలం లేదనే కారణంగా టిడిపి పక్కన పెట్టినట్లు సమాచారం. దెందులూరు నియోజకవర్గంలో చింతమనేనిని వ్యతిరేకిస్తున్న అదే సామాజిక తరగతికి చెందిన నాయకులు దెందులూరు టిక్కెట్ మాగంటి బాబుకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆర్థిక బలం లేదని చెప్పి అక్కడ కూడా ఆయన్ని పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఏలూరు ఎంఎల్ఎ టిక్కెట్ జనసేనకు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న రెడ్డి అప్పలనాయుడుకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయనకు ఆర్థిక బలం లేదనే కారణంతో జనసేన అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. టిడిపి ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గన్ని వీరాంజనేయులు, జనసేన ఇన్‌ఛార్జిగా మత్సపట్ల ధర్మరాజు ఉన్నారు. గన్నిపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో టిక్కెట్ ఎవరికి ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నారు. దీంతో వట్టి వసంతకుమార్ కుటుంబం నుంచి వచ్చిన ఆర్థిక బలం ఉన్న వట్టి పవన్‌పై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆ టిక్కెట్ జనసేనకు కేటాయించినా ధర్మరాజుకు కాకుండా ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థికే ఇవ్వాలని చర్చలు సాగుతున్నట్లు సమాచారం. చింతలపూడి, పోలవరం, కైకలూరుతోపాటు మిగిలిన స్థానాల్లో ఆర్థిక బలం పుష్కలంగా ఉన్న అభ్యర్థుల కోసం టిడిపి, జనసేన సైతం ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో కోట్లు కుమ్మరించేవారికి టిక్కెట్ అనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులను పార్టీలు ఎంపిక చేస్తుండటంతో ఈ ఎన్నికల్లో చాలాచోట్ల కొత్తముఖాలు తెరపైకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరి ఇటువంటి నేతలు ప్రజాప్రతినిధులైతే ప్రజా సమస్యలు ఏమేరకు పరిష్కరిస్తారనేది అంతుబట్టని ప్రశ్నే.

ఆక్వా రంగాన్ని బతికించండి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆక్వా రైతులు కదం తొక్కారు. త్వరలో క్రాప్ హాలిడే ప్రకటిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. కొన్నాళ్లుగా పెరిగిన మేత ధరలు, విద్యుత్ ఛార్జీలతో సతమతమవుతున్న ఆక్వా రైతులు ఒక్కసారిగా ఆందోళన బాట పట్టారు. స్థానిక జైభారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు ఆధ్వర్యంలో వేలాది మంది ఆక్వా రైతులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక భీమవరం బైపాస్ రహదారి నుంచి గాంధీ బొమ్మల సెంటర్, తహశీల్దార్, విద్యుత్ కార్యాలయం మీదుగా ఆక్వా కార్యాలయం సభాస్థలి వరకు 2కె ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రంగం నుంచి వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కదం తొక్కిన అంగన్వా'ఢీ'లు

జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు, మానవహారాలు

40వ రోజు కొనసాగిన సమ్మె

తణుకులో..

వీరవాసరంలో...

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 40వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు, మానవహారాలు చేసి కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేదిలేదని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో కార్మిక సంఘాలు, సిఐటియు, ఎఐటియుసి, టియుసిసి రాస్తారోకో చేశారు. అంగనవాడీల పట్ల సిఐ శ్రీనివాస్ దురుసుగా ప్రవర్తించడంతో కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఎఐటియుసి నాయకులు రంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, నాగరత్నం, దుర్గ, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించి సిఎం జగన్, మంత్రి బొత్స సత్యనారాయణలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మాట్లాడుతూ సమ్మె విరమించాలంటూ అంగన్వాడీలను బెదిరించడానికి బదులుగా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీలకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు సిర్రా నరసింహమూర్తి, వద్దిపర్తి శ్రీనివాసరావు, కుసుమే జయరాజు, సరిళ్ల రాధాకృష్ణ, తిప్పా ప్రసాద్, దుర్గాప్రసాద్ మద్దతు తెలిపారు.

యలమంచిలి : మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా సంఘీభావం తెలిపింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, ఐద్వా జిల్లా నాయకులు సరిపల్లి జయప్రభ, అంగన్వాడీ నాయకులు రజని, దేవి, శకుంతల పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరంలో అంగనవాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం నిర్వహించిన రాస్తారోకో ఉద్రిక్తంగా మారింది. రాస్తారోకోలో భాగంగా అంగన్‌వాడీలు జాతీయ రహదారిపై బైఠాయించారు. అక్కడకు చేరుకున్న ఎస్ఐ రమేష్ సిఐటియు నాయకుడు ఎం.ఆంజనేయుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పరిస్థితితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఆంజనేయుల రెండు కాళ్లను పట్టుకుని ఎస్ఐ ఈడ్చివేయడంతో అంగనవాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా ఆంజనేయులు చుట్టూ రక్షణగా చేరడంతో ఎస్ఐ వెనక్కి తగ్గారు. అంగన్‌వాడీలు రాస్తారోకో కొనసాగించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన అంబులెన్స్‌కు మార్గం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఒక స్థానికుడు అంగనవాడీలను దుర్భాషలాడటంతో వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. తమ మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన స్థానికుడి పట్ల చర్యలు తీసుకోవాలన్నారు. దుర్భాషలాడిన స్థానికుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే ఆలోచనలో అంగన్‌వాడీలున్నారు. వీరికి సిపిఎం నాయకులు బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, బొర్రా ఆలమహారాజు, యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము మద్దతు తెలిపారు.

కాళ్ల : కాళ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ, ఝాన్సీరాణి, కమల, రాజేశ్వరి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాతు రామస్వామి, ఆశావర్కర్స్ యూనియన్ లీడర్ రెడ్డి దేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం మండల అధ్యక్షులు యిర్రింకి ఏడుకొండలు, అంగన్వాడీ, ఆశ ,ఫీల్డ్అసిస్టెంట్లు, భవననిర్మాణ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సిఐటియు, టిఎన్‌టియుసి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో నరేంద్రసెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు చేసిన వారిని విడుదల చేయాలని అంగన్వాడీలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అనంతరం పోలీసులు ప్రతాప్, రంగారావులను విడుదల చేశారు. తొలుత కోర్టు వద్ద నిర్వహించిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గండి రామకృష్ణ, సిపిఐ నాయకులు అప్పలస్వామి, టిడిపి నాయకులు తాతపూడి మారుతీరావు, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ, ఎస్‌డబ్ల్యూ డిపో కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ఆదినారాయణబాబు, అంబటి బ్రహ్మాజీ, సిహెచ్.రామకృష్ణ, మందులయ్య, కొంగరాపు సత్యవతి, మణిమాలతి, ఎం.జ్యోతి, ప్రమీల, కనకదుర్గ, మంగతాయారు, ధనలక్ష్మి, రజని పాల్గొన్నారు.

భీమవరంలో...

కాళ్లలో...

తాడేపల్లిగూడెం : స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, అంగనవాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ, యడవల్లి వెంకటదుర్గారావు, ప్రభారాణి పాల్గొన్నారు.

పెంటపాడు : పెంటపాడులో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీ శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి పెంటపాడు సెంటర్‌లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకాయల బాబూరావు, సిఐటియు నాయకులు బంకురు నాగేశ్వరరావు, అంగన్వాడీ నాయకులు శ్యామలకుమారి, కె.కనకమహాలక్ష్మి, సిహెచ్.శ్రీదేవి, ఆర్.అనురాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు వరప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు, సిఐటియు అనుబంధ సంఘాలు రైల్వే గూడ్స్ షెడ్ సభ్యులు, ఉల్లిపాయలు మార్కెట్ హమాలీలు, మార్కెట్ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక పోలీస్ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు ఎన్.రామకృష్ణ, ఎస్.సంజీవరావు, వి.వీం ̆భద్రం, ఎం.వెంకటేశ్వరావు, అంగన్‌వాడీ నాయకులు సీతామహాలక్ష్మి, సిహెచ్.సీతామహాలక్ష్మి, కె.ధనలక్ష్మి, ఎం.లక్ష్మి, బి.జయలక్ష్మి, పి.పద్మావతి, ఎస్.లక్ష్మి, జె.ప్రవీణ, బి.రామలక్ష్మి, వై.రాణి పాల్గొన్నారు.

ఇరగవరం : ఇరగవరంలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అజయ్‌కుమారి, అంగన్‌వాడీ కార్మికులు పాల్గొన్నారు.

పోడూరు : కవిటం సెంటర్‌లో పాలకొల్లు మార్టేరు ప్రధాన రహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు వైట్ల ఉషారాణి, సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ప్రధాన కూడళ్లలో అంగన్‌వాడీలు ప్రదర్శన చేశారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. టిడిపి నాయకులు, ఎన్ఆర్ఐ కొవ్వలి యత్తి రాజారామ్మోహన్‌నాయుడు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు రాంబాబు, పాల రాంబాబు, గోపాలం, బొల్ల చంటి, కొల్లాటి భోగరాజు, జక్కంశెట్టి ఏసుబాబు, సిపిఎం నాయకులు ఆదూరి సాంబమూర్తి, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండలో అంగన్‌వాడీలకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఆచంట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. సమ్మెలో పాల్గొంటూ గుండెపోటుతో మరణించిన కోనసీమ జిల్లాకు చెందిన అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, గ్రామ సర్పంచి నక్క శ్యామలాసోనీ, నానాజి, వేంద్ర రాము, నక్కా వేదవ్యాసశాస్త్రి, చలుమూరి శేఖర్, సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, అంగన్వాడీల పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ కానూరి తులసి పాల్గొన్నారు.

అత్తిలి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, సిఐటియు మండల కన్వీనర్ వనం రాంబాబు, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక జాతీయ రహదారిపై పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ వలి, రంగా, అంగన్వాడీ నాయకులు కె.పైడేశ్వరి, సీతామహాలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

ఉండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, వీరవల్లి మాధవరావు, కింతాడ రమేష్, కొట్టాడ వెంకటేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాస్, మజ్జి నాగేశ్వరరావు, కడలి నాగేశ్వరరావు, అంగన్వాడీలు చైతన్య, ఝాన్సీ, జయశ్రీ, వీరవల్లి వెంకటలక్ష్మి, కుసుమ, శ్యామల, లలితకుమారి, ప్రేమలత పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, సిఐటియు నాయకులు పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, నోములకొండ పొన్నాడ మల్లేష్, రైతు సంఘం నాయకులు పిల్లి కామేశ్వరరావు, గుబ్బల చిన్ని, కడలి రవి, రామలింగం పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : పెనుమంట్ర బ్రాహ్మణ చెరువు సెంటర్‌లో రాస్తారోకో, మానవహారం నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, కెవిపిఎస్.జిల్లా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్, అంగన్వాడీ అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, సాయి మహాలక్ష్మి, మౌనిక, అంగన్వాడీ కార్మికులు భవాని, రాజ్యలక్ష్మి, భవాని, లక్ష్మీదుర్గ, సూర్యప్రభ, చంద్రకళ పాల్గొన్నారు.



జగ్గారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్గారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గణపవరం

నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కృషి చేసిన సిపిఎం కేశవరం గ్రామ కమిటీ సభ్యులు మచ్చెట్టి జగ్గారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. కేశవరంలో శనివారం నిర్వహించిన జగ్గారావు సంతాపసభలో ఆయన మాట్లాడారు. ఈ సభకు సిపిఎం మండల కమిటీ సభ్యులు నరాలశెట్టి రామకృష్ణ అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ జగ్గారావు దంపతులు 1983 నుంచి కేశవరంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ప్రజా పోరాటాల్లో పని చేసిన వ్యక్తులు భౌతికంగా దూరమైన నిరంతరం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఎంపిటిసి మాజీ సభ్యులు సుబ్బరాజు, సిఐటియు మండలాధ్యక్ష కార్యదర్శులు పి.గోవిందు, ఎం.పెంటారావు మాట్లాడుతూ కేశవరంలో జరిగిన వరి కోత యంత్ర పోరాటం, ఇళ్ల స్థలాల పోరాటాల్లో జగ్గారావు దంపతుల పాత్ర వెలకట్టలేదన్నారు. జగ్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల నాయకులు సోడదాసి సంజీవరావు, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, తోట మహాలక్ష్మి పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బ్యాంకు ప్రమాద బీమా పత్రాలు ఇవ్వడంలేదని ఒక వ్యక్తి సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని చినఅమిరం గ్రామానికి చెందిన లోకం ఏసు ఒక బ్యాంకులో ప్రమాద బీమా చేసినట్లు, ఆ బ్యాంకు యాజమాన్యం తనకు పత్రాలు ఇవ్వకుండా మభ్యపెడుతున్నట్లు చెప్పి జువ్వలపాలెం రోడ్డులో చినఅమిరం గ్రామం పరిధిలోని సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం సెల్‌టవర్ ఎక్కిన ఏసు అప్పటి నుంచి పైనే ఉండి తన నిరసన కొనసాగిస్తున్నాడు. అతనికి కుటుంబసభ్యులు రాత్రి సమయంలో భోజనం అందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఏసును టవర్ నుంచి కిందకు దింపేందుకు డిఎస్‌పి శ్రీనాథ్, సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏసు బ్యాంకులో ప్రమాద బీమా తన తండ్రి పేరున చేయించినట్లు చెబుతున్నాడన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఏసు లేవని, చూపించలేదని చెప్పారు. డిఎస్‌పి శ్రీనాథ్ పత్రాలను పరిశీలించారని, రూ.1.50 లక్షల క్లెయిమ్ అయ్యే బీమా చేయించుకుని, ఏసు రూ.10 లక్షలు బీమా చేయించుకున్నానని చెబుతున్నారని తెలిపారు. ఏసు ఇదే విషయంపై గతంలో కూడా టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు.



జాహ్నవిని అభినందిస్తున్న యాజమాన్యం

జాతీయ యువజనోత్సవాల్లో జాహ్నవి ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహారాష్ట్ర నాసిక్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన 27వ జాతీయ యువజనోత్సవాల్లో పర్వతారోహణ క్రీడా విభాగంలో వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థిని కె.పద్మజాహ్నవి పాల్గొని ప్రతిభ కనబర్చింది. విద్యార్థినిని ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ అభినందించారు. భారత ప్రభుత్వ సంస్థ నెహ్రూ యువ కేంద్ర ఆర్థిక సహకారంతో జిల్లా స్థాయి నుంచి జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనే స్థాయి వరకు జాహ్నవి పట్టుదలతో శ్రమించిందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి అన్నారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ ఉప కులపతి జానకిరామ్ తనను వెన్నంటి ప్రోత్సహించి ఎంతో సహకారం అందించారన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డిఆర్.సలోమీసునీత, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవిలకు జాహ్నవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, అధ్యాపకులు డాక్టర్ ఆర్‌వి.సుజాత, డాక్టర్ ఉషాకుమారి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.మార్కండేయ అన్నారు. నరసాపురం యుటిఎఫ్ భవనం వద్ద నుంచి ఎంఇఒ కార్యాలయం వరకు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మార్కండేయ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 24వ తేదీన జిల్లాస్థాయిలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ జి.స్వామి, నరసాపురం మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్, టౌన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మాణిక్యాలరావు, ఎన్.చంద్రకుమార్, మొగల్తూరు మండలాధ్యక్షులు సిహెచ్.కృష్ణమోహన్, పి.శాంసన్, ఆర్ఆర్‌కె.రాజు, కె.బ్రహ్మయ్య, ఎంవి.లక్ష్మీకళ పాల్గొన్నారు.

పాలకొల్లులో సామాజిక సర్వే ప్రజావేదిక

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉపాధి హామీ చట్టం పనులపై సామాజిక సర్వే ప్రజా వేదిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సామాజిక తనిఖీ అధికారి పున్నపునాయుడు రికార్డులను పరిశీలించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.35,592 రికవరీకి ఆయన ఆదేశించారు. నష్టపోయిన కూలీలకు రూ.958 ఇవ్వాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు 27 పంచాయతీల మీద రూ.తొమ్మిది వేలు జరిమానా విధించారు. రూ.27,446 అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజశేఖర్‌రావు, డిప్యూటీ విజిలెన్స్ ఆఫీసర్ ఎ.విజయలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ విజయలక్ష్మి, ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఎంపిపి భర్తకు గాయాలు

ప్రజాశక్తి - పోడూరు

రోడ్డు ప్రమాదంలో ఎంపిపి సుమంగళి భర్త సబ్బితి విద్యాసాగర్ గాయాలపాలయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పోడూరు నుంచి ఏర్పాటు చేసిన బస్సులో ఆయన వెళ్లారు. అనంతరం సాయంత్రం బస్సులో తిరిగి పోడూరు బయలుదేరారు. మార్గమధ్యలో గన్నవరం సమీపంలోకి వచ్చేసరికి బస్సు ఆగడంతో దిగారు. ఈ క్రమంలో విద్యాసాగర్‌ను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆయన విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు విద్యాసాగర్‌ని పరామర్శించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రయాణం సురక్షితం, సుఖప్రదం కావాలి

రహదారి భద్రతా మాసోత్సవాల ప్రారంభంలో ఎస్‌పి రవిప్రకాష్

వాల్‌పోస్టర్లు, బ్యానర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రయాణం సురక్షితం, సుఖప్రదం కావాలని ఎస్‌పి యు.రవిప్రకాష్ అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, గోడప్రతులు, బ్యానర్లను ఎస్‌పి కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రతిఒక్కరూ విధిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని, కుటుంబాన్ని, ఆత్మీయులను గుర్తు పెట్టుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్దేశిత తేదీల్లో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా అంతటా, పోలీస్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, మున్సిపల్, మెడికల్, హెల్త్, నేషనల్ హైవేస్ శాఖల సమన్వయంతో రహదారి భద్రత మసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అవగాహనా సదస్సులు, ర్యాలీలు, వర్క్‌షాపులు, స్టూడెంట్స్‌కు క్విజ్‌లు, మెడికల్ క్యాంపులు, స్కూల్ బస్సు, వివిధ క్లాస్ ఆఫ్ వెహికల్ గల వాహన చోదకులకు శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సిహెచ్.వెంకటరమణ, కెఎస్ఎన్.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రవికుమార్, ఎన్ఎల్ఎస్.లక్ష్మి, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కృష్ణంరాజు ఆశయ సాధనకు కృషి

ఆయన సతీమణి శ్యామలాదేవి

ప్రజాశక్తి - మొగల్తూరు

కృష్ణంరాజు ఆశయ సాధన మేరకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఆయన సతీమణి శ్యామలాదేవి, లండన్‌కు చెందిన షుగర్ వ్యాధి నిపుణులు వేణు కవర్తపు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి, రెబల్ స్టార్ కృష్ణంరాజు జయంతి వేడుకను మొగల్తూరులో ఆయన స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణంరాజు పేదలకు విద్య, వైద్యం అందించడం కోసం తపించేవారన్నారు. ఆయన ఆశయ సాధన మేరకు తాము యుకె డయాబెటిక్ ఫుడ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. కొన్ని కారణాలతో ఆయన ఉండగా అమలు చేయలేకపోయామని, ఇప్పుడు ప్రారంభించామని తెలిపారు. ఈ శిబిరాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు, మాజీ సర్పంచి కలిదిండి స్వర్ణకుమార్‌బాబు, ఆకుల శేషసాయి సతీమణి గీత, పులపర్తి వెంకటేశ్వరరావు దాసరి బాబి, సిహెచ్‌విపి శ్రీనివాస్‌ప్రసాద్,



కేక్ కట్ చేస్తున్న శ్యామలాదేవి

కెపిఎస్ఎన్.ముక్తేశ్వరరావు, పలు పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

షుగర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లండన్‌కు చెందిన షుగర్ వ్యాధి నిపుణులు వేణు కవర్తపు, ఉప్పలపాటి శ్యామలాదేవి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, రెబల్ స్టార్ కష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని మొగల్తూరులోని అందే బాపన్న జూనియర్ కళాశాల కోట్ల వెంకట రంగారావు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యుకె ఇండియా డయాబెటిక్ ఫుడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. తాము చేపట్టిన వైద్య శిబిరాల ద్వారా షుగర్ వ్యాధితో కాలు చేతులు వంటి అవయవాలు కోల్పోకుండా నిరోధించేందుకు తగు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సుమారు 30 మంది వైద్యులు 2000 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి భీమవరం వర్మ హాస్పిటల్, హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వర్మ హాస్పిటల్ అధినేత పిఆర్‌కె.వర్మ, రాయసం నరేష్ అపోలో ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్ వైద్య సేవలందించారు. ఏరియా ఆర్‌ఎంపి అసోసియేషన్ సభ్యులు, పలువురు వాలంటీర్లు సేవలందించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, టిడిపి నాయకులు ఎన్ఆర్ఐ కొవ్వలియతి రాజారామ్మోహన్ నాయుడు, జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సందర్శించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న గ్రామ సర్పంచి

కబడ్డీ పోటీల్లో ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టు విజయం

ప్రజాశక్తి - ఉండి

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఎన్ఆర్‌పి.అగ్రహారం కబడ్డీ జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో కలిసిపూడి జట్టుపై విజయం సాధించి మండల విజేతగా నిలిచింది. ఎన్ఆర్‌పి అగ్రహారం జట్టుకు ఆ గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఉండి మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ గ్రామానికి చెందిన జట్లు ఆరు క్రీడల్లో విజేతగా నిలిచి మండలంలో తమ గ్రామ పేరును నిలిపారన్నారు. జిల్లా స్థాయిలో కూడా తమ క్రీడాకారులు రాణించి విజేతగా నిలిచి తమ గ్రామ ఉనికిని చాటాలని వారు కోరారు. విజేతలుగా నిలిచిన జట్టుకు బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మిశ్రీనివాస్, మాజీ సర్పంచి మునుకోలు సింహాచలం, నాయకులు గళావిల్లి ధనుంజయ, ముగ్గళ్ల సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు అభినందనలు తెలిపారు.

నరసాపురం : ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలకు విజయవంతంగా పూర్తి చేసుకుని నియోజకవర్గ స్థాయికి చేరుకున్న క్రీడాకారులను మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ, వైస్ ఛైర్మన్ కామన నాగిణి, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం అభినందించారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో పోటీలకు చేరుకున్న క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, నానాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిపిఒచే కులగణన సర్వే పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఉండి : కులగణన సర్వేను పరిశీలిస్తున్న డిపిఒ మల్లికార్జునరావు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వే ప్రక్రియను మండలంలోని కోలమూరు గ్రామంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ప్రతి అధికారి తమ వాలంటీర్లచే జనవరి 28వ తేదీ లోపు కులగణన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అందే కొండలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.శంకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : ఈ నెల 19న ప్రారంభించిన కులగణన శనివారం కొనసాగింది. పలుచోట్ల సర్వర్ సరిగా పని చేయకపోవడంతో నమోదు ప్రక్రియ మందగించిందని సిబ్బంది తెలిపారు. వారం రోజుల్లో కులగణన సర్వే పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

గణపవరం విద్యాశాఖను పశ్చిమలో విలీనం చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

గణపవరం మండలం విద్యా శాఖను పశ్చిమగోదావరి జిల్లాలో కలపాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం కోరారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్లగా ఆమె అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారికి అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం ఏలూరు జిల్లాలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసినట్లు చెప్పారు. ఆ గెజిట్‌లో రెవెన్యూ, పోలీస్, అన్ని విభాగాలను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారని, విద్యాశాఖ విభాగాన్ని ఏలూరు జిల్లాలోని కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో గణపవరం మండలంలో పనిచేస్తున్న సుమారు 200 మంది ఉపాధ్యాయులు కొన్ని రకమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో విద్యాశాఖను కూడా పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ, జిల్లా కార్యదర్శి జిడబ్ల్యుపి.కుమార్, భీమవరం మండల ఉపాధ్యక్షులు టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

3,848 మందికి టిడ్కో గృహాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధించి రెండో విడతగా 3,848 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి విడతగా రెండు వేల గృహాలను లబ్ధిదారులకు అందించామని, రెండో విడతగా 3,848 గృహాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు పంపిణీ చేసేవాటిలో వెయ్యి గృహాలకు పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగాయని, మిగిలిన వాటికి ఫినిషింగ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనులు కూడా నెల రోజుల్లోగానే పూర్తవుతాయని తెలిపారు. లబ్ధిదారులు విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు రాజు, టిడ్కో, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బిటి రోడ్డును ప్రారంభిస్తున్న గ్రంధి శ్రీనివాస్

అభివృద్ధి, సంక్షేమమే తమ ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొలుత 34వ వార్డులో రూ.20.50 లక్షల నిధులతో సీత టవర్స్ నుంచి గోపీకృష్ణ టవర్ వరకు, ఎస్ఆర్‌కెఆర్.రోడ్డు నుంచి ఎఎస్ఆర్ కల్యాణ మండపం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 35వ వార్డులో రూ.19.50 లక్షల నిధులతో ఆదర్శనగర్ రెండో వీధి నుంచి వంశీకృష్ణనగర్‌లోని కాస్మో క్లబ్ వెనుక వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.29.50 లక్షలతో ఉండి రోడ్డు నుంచి వివిఎస్-ఎస్ గార్డెన్స్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 36వ వార్డులో రూ.10.50 లక్షలతో సత్యవతి నగర్ టౌన్ స్టేషన్ కాంపౌండ్ వాల్ నుంచి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, 37వ వార్డులో రూ.23.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా భీమవరం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడమే కాకుండా నియోజకవర్గంలో సుమారు 15 వేల మందికి పైగానే ఇళ్ల స్థలాలను, పట్టాలను అందించామన్నారు. ప్రజల సూచనల మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ముఖ్యంగా భీమవరం పట్టణంలో ఇప్పటివరకు దాదాపుగా రూ.100 కోట్లకు నిధులు పైబడి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, ఎఎస్.రాజు, నడింపల్లి అప్పలరాజు, ముత్యాల బుజ్జి, మానేపల్లి నాగన్నబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -భీమవరం

మాట్లాడుతున్న సత్యదేవి

లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మూడో అదనపు న్యాయమూర్తి చైర్‌పర్సన్ పి.సత్యదేవి అన్నారు. స్థానిక కోర్టు సమావేశ మందిరంలో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధక చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యదేవి మాట్లాడుతూ మహిళలు, బాలికలను రక్షించడానికి ఎన్నో చట్టాలున్నాయన్నారు. వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్‌కుమార్, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంవి.రమణరావు, జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతరాణి, విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ఎ.శివకృష్ణ, ఆర్‌టిసి పర్సనల్ ఆఫీసరు ఎల్.గీతావాణి, కన్స్యూమర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.కరుణాకరరావు, వివిధ శాఖల సూపరింటెండెంట్లు మహిళా ఉద్యోగులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ధనికొండ శ్రీనివాస్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - ఉండి

సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాతృమూర్తి ధనికొండ నాగమణి (67) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధనికొండ శ్రీనివాస్ మాతృమూర్తి నాగమణి మృతి బాధాకరమన్నారు. శ్రీనివాస్ తల్లి మరణ వార్త నుంచి తొందరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. ధనికొండ శ్రీనివాస్‌ను నాయకులు కింతాడ రమేష్, చిప్పాడ బుచ్చేశ్వరరావు, చీరల శేషు, వీరవల్లి శ్రీనివాస్, వీరవల్లి వెంకటలక్ష్మి, కడలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, కాల్వ ఏసు, మాదాసి గోపీ పరామర్శించి నాగమణి అంత్యక్రియలలో పాల్గొన్నారు.

పేద వ్యక్తికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు గ్రామానికి చెందిన పేద చేనేత కార్మికుడు నిల్లా నాగేంద్ర ఇటీవల గొంతు కేన్సర్‌కు చికిత్స పొందారు. పేదరికంతో మందులు కొనుక్కోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి రావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అతనికి మూడు నెలలకు అవసరమైన రూ.6 వేల విలువైన మందులను క్లబ్ తరపున శనివారం అతని ఇంటి వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగాపవన్, విశ్రాంత ఉపాధ్యాయుడు కెకె.వీరభద్రరావు పాల్గొన్నారు.

'రాముడు పేరుతో బిజెపి రాజకీయ డ్రామా'

ప్రజాశక్తి - ఉండి

రాముడు పేరుతో బిజెపి రాజకీయ డ్రామాకు తెరలేపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు విమర్శించారు. మండలంలోని మహాదేవపట్నం గ్రామంలో మేరిగి సుధాకర్ అధ్యక్షతన కోన గొల్లయ్య నివాసంలో శనివారం నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోనే ఇప్పుడు రాముడి పేరును వాడుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారన్నారు. రాజకీయాల్లోకి మతాన్ని ఆపాదించడం దారుణమని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మతతత్వ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీలకు రాజకీయ భవిష్యత్తు ఉండదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, తమరాణి శ్రీనివాస్, కోన గొల్లయ్య, కేత నాగమణి, కోనా నెలబాలుడు, వీరవల్లి మాణిక్యాలరావు, పెచ్చేటి ఏడుకొండలు, గుమ్మల్ల శ్రీను, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన అక్కాచెల్లెళ్లను మొగల్తూరులోని మెన్ కేబుల్ అధినేత కాసాని కృష్ణ, షిరిడి సాయి కేబుల్ నెట్‌వర్కర అధినేత కోట్ల సుధాకర్ ఘనంగా సత్కరించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన కడలి రేవతి, కరుణ అక్కాచెల్లెళ్లు ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. వారిద్దరితో పాటు వారికి స్ఫూర్తిదాయంగా నిలిచిన ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వారి అక్క నాగదుర్గభవాని ముగ్గురు కలిసి మొగల్తూరులోని బంధువులు ఇంటికి శనివారం రాత్రి వచ్చారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

'దళితులను మోసగించిన వైసిపి'

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి ప్రభుత్వం దళితులను మోసగించిందని టిడిపి, జనసేన ఎస్‌సి నాయకులు విమర్శించారు. మండలంలోని మట్టపర్రులో దళితులకు ప్రభుత్వం రద్దు చేసిన 27 పథకాలు అమలు చేయాలని కోరుతూ వారు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో రద్దయిన పథకాల కరపత్రాలను పంచారు. సంక్షేమ పథకాలను రద్దు చేయడం వల్ల అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, ముప్పిరి సత్యనారాయణ, కొండేటి జీవరత్నం, దొమ్మేటి శ్రీను, మైగాపుల శ్రీను, జనసేన నాయకులు పీతాని వెంకట్, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 290-292/General/2023-24, Dated. 18-01-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of Vaporized Liquid Chlorine Gas Cylinders, Ferric Alum and Manufacturing Supply and Delivery of Push Carts in Municipal Corporation, Eluru"** Total No. of works is 3 with an amount of Rs. **29.79** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 20-01-2024. Last date of receipt of tenders is 25-01-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU